తిలక్‌నగర్‌లో అష్టఐశ్వర్య లక్ష్మీదేవి ప్రత్యేక దర్శనం


ప్రత్యేక పుష్పాలంకరణ అష్టఐశ్వర్య లక్ష్మీదేవి

నల్లకుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి మంగళవారం పురస్కరించుకుని నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లోని విశ్వసాయిబాబా దేవాలయంలోని అష్ట ఐశ్వర్య లక్ష్మీదేవి అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవి శ్యామ్‌రావు, భాగ్యరేఖ, తోట భవాని, ఉదయశ్రీ, రాంగోపాల్, సునీత, పద్మ, శైలజ, శార్వారి, రమాదేవి, మంజుల, లలిత, చంద్రకళ, అనురాధ, రేణుక, రేఖ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా భవానీ అమ్మవారు



చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పూజల్లో భాగంగా మంగళవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని భవాని మందిరంలో అమ్మవారు భక్తులకు శాకాంబరిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ్యఅర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

1969 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పీవీ.ప్రభాకర్‌రావుతో పూర్వ విద్యార్థులు

నల్లకుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ పాఠశాలకు చెందిన 1969 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం మంగళవారం ఆ పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి స్నేహితులంతా ఒకచోట చేరి ఆప్యాయంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి పాఠశాల విద్యార్థుల కమిటీ చైర్మన్‌గా మాజీ ప్రధాని, దివంగత పీవీ.నరసింహారావు చిన్న కుమారుడు పీవీ.ప్రభాకర్‌రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన జన్మదినం కావడంతో ఆయనకు పూర్వ విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. జస్టిస్ శ్రవణ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

డివిజన్ ప్రజలకు సేవలందించేందుకు సిద్ధం

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డివిజన్ ప్రజలకు అత్యున్నతమైన ప్రజాసేవలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్ మహిళామోర్చా, దళితమోర్చా, బీజేపీ, బీజేవైఎం, పలువురు సీనియర్ మహిళానేతలు కార్పొరేటర్‌ను మంగళవారం కార్పొరేటర్ కార్యాలయంలో కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటుజాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఆయా విభాగాల నాయకురాళ్లు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాస్కాలర్‌షిప్‌ల పంపిణీ

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులలో ఎంపిక చేసినవారికి బుధవారం ఉదయం అశోక్‌నగర్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో విద్యాస్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తామని ఆ సంస్థ డైరెక్టర్ మల్లవరపు బాలలత తెలిపారు. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఈడీ ఉమా చిగురుపాటి తదితరులు అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

వైన్స్ టెండర్లలో 30 శాతం రిజర్వేషన్ కల్పించాలి

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్‌లో నిర్వహించే వైన్స్ టెండర్లలో ఆరెకటికలకు 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరెకటికలకు ప్రభుత్వం రూ.500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. బీసీ డీ గ్రూప్ నుంచి తమకు బీసీ ఏ హోదా కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయాలన్నారు. ఆరెకటికలు నిర్వహించే మటన్ షాపులకు ఉచిత కరెంట్ ఇవ్వాలన్నారు. ఆరెకటిక మహిళలకు రూ.3 లక్షల బ్యాంకు రుణాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ ఆయుర్వేద ఆస్పత్రిలో నిధుల గోల్‌మాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో రోగుల డైట్ పేరుతో లక్షల రూపాయల గోల్‌మాల్ జరిగిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల ఆసుపత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ ఆడిటింగ్ నిర్వహించగా ఈ బాగోతం బయటపడింది. ఆసుపత్రిలో 204 పడకలు ఉన్నప్పటికీ రోజుకు గరిష్ఠంగా 40-50 మంది మాత్రమే ఇన్‌పేషెంట్లుగా ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. కాని 170-180 మందికి డైట్ ఇస్తున్నట్లు లెక్కల్లో చూపి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి నెలా గరిష్ఠంగా రూ.4.6 లక్షల వరకు డైట్ బిల్లులు వస్తుండగా, అందులో సగం పక్కదారి పడుతోంది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు ప్రారంభమై పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న అంజన్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌కు చెందిన మాజీద్ హుస్సేన్‌కు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అంజన్‌కుమార్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కావాల్సిన నిధులను విడుదల చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి


కాసాని జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ముషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా ముదిరాజ్‌లు ఐక్యంగా ఉన్నప్పుడే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసి ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... ముదిరాజ్‌లు రాజకీయంగా రాణించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తాచాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీకాంత్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, సదా, కాంచి ముదిరాజ్ పాల్గొన్నారు.

బస్తీలు, కాలనీల్లో వర్షపునీరు నిల్వకుండా చర్యలు

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


బాగ్‌అంబర్‌పేటలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని బస్తీలు, కాలనీల్లో వర్షపు నీరు నిల్వకుండా వెంటనే చర్యలు చేపట్టాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం విష్ణువర్ధన్, జీహెచ్ఎంసీ డీఈ ప్రశాంతితో కలిసి ఎమ్మెల్యే గాయత్రీనగర్ టవర్, బతుకమ్మకుంట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపునీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కాలనీవాసులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి: ఎమ్మెల్యే


శ్రీరాంనగర్‌లో వరదనీటి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోపాల్ అధికారులు

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్ బస్తీలో వరదనీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. మంగళవారం శ్రీరాంనగర్‌లో జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం మోహన్‌రాజ్, జీహెచ్ఎంసీ డీఈ గీత తదితర అధికారులు, బస్తీవాసులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ బస్తీలో వర్షం పడితే నీరు నిలిచి ఉంటుందని, ఇబ్బందులకు గురవుతున్నామని ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే నీరు నిలువకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. బస్తీలో నిలిచిననీరు తొలగించేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ ప్రధానకార్యదర్శి దామోదర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని బర్కత్‌పురలో అవంతి కాలేజీ వెనుక జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణకుమారి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తు నిర్మిస్తున్న భవనాన్ని మంగళవారం డీఎంసీ మారుతిదివాకర్, టీపీవో సత్యవర్ధన్‌తో కలిసి ఆమె పరిశీలించారు. సిల్ట్ ప్లస్ 4 అనుమతి తీసుకుని అదనంగా మరో అంతస్తు నిర్మిస్తున్న పనులను ఆపివేసి సీజ్‌చేయాలని ఆదేశించారు. డీఎంసీ మారుతిదివాకర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపోచమ్మ ఆలయం వద్ద అంధకారం

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ సిద్దంశెట్టి టవర్స్ బంగారు పోచమ్మ ఆలయం వద్ద అంధకారం నెలకొనడంతో స్థానికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం ఆలయానికి వచ్చే భక్తులు అంధకారం ఉండడంవల్ల పూజలు నిర్వహించడంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రెండు నెలలుగా ఆలయంవద్ద ఉన్న మూడు స్ట్రీట్‌లైట్లు వెలగకపోవడంతో రాత్రి అయ్యిందంటే ఆలయం వద్ద చీకటిగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. కాగా చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో సోమవారం రాత్రి చెట్టుకొమ్మలు కరెంట్‌వైర్లపై పడిపోవడంతో అంధకారం నెలకొంది. రాత్రి పొద్దుపోయేవరకు కూడా విద్యుత్‌ను పునరుద్ధరించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులు హైడ్రా, విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్‌లు చేసి కూలిన చెట్ల కొమ్మల శిథిలాలను తొలగింపచేశారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి: డీసీపీ


సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గతంలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు చాలావరకు పాడైపోయాయని వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు, వ్యాపారులు ముందుకు రావాలని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి సూచించారు. ఇటీవల చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న వివరాలు వెల్లడించిన ఆమె విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పది పదిహేను సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలా చోట్ల పనిచేయడం లేదన్నారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకోవాలన్నారు.


అరుంధతినగర్‌లో చెత్తకుప్పలను పరిశీలిస్తున్న బస్తీ వాసులు

అరుంధతీనగర్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారం

చిక్కడపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అరుంధతీనగర్ బస్తీలో పదిరోజులుగా మున్సిపల్ సిబ్బంది చెత్త ఎత్తకపోవడంతో చెత్త, మట్టికుప్పలు, రాళ్లూరప్పలు పేరుకుపోయాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. బస్తీలో చెత్తను ఎత్తడంలేదని, ఎన్నిసార్లు ఏఎంవోహెచ్‌కు ఫోన్ చేసినా కూడా స్పందించడంలేదన్నారు. మున్సిపల్ సిబ్బందిని చెత్తను తొలగించాలని కోరితే పట్టించుకోవడంలేదని ఆయన వివరించారు. బస్తీలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను సర్కిల్ డీఎంసీ తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌లో గంజాయి రవాణా

- ఓ మహిళా స్మగ్లర్ సహా.. ఇద్దరి అరెస్టు
- 18 కేజీల గంజాయి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి ఔరంగాబాద్‌కు వయా హైదరాబాద్ మీదుగా గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్స్ ఆటకట్టించారు సెంట్రల్‌జోన్ పోలీసులు. ఓ మహిళతో పాటు మరో స్మగ్లర్‌ను దోమలగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 18 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని లిబర్టీ జంక్షన్ సమీపంలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ ఎదురుగా ఓ మహిళ, మరో యువకుడు రెండు బ్యాగులతో బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందన్న సమాచారంతో దోమలగూడ పోలీసులు ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించిన క్రమంలో మహారాష్ట్ర ఔరంగాబాద్‌కు చెందిన కోమల్ సోమినాథ్ పవార్, సాహిల్ మహేష్ సాలుంగా తేలింది. స్థానికంగా వ్యవసాయ పనులు చేసుకునే ఇద్దరూ వచ్చే ఆదాయం సరిపోక, సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి స్మగ్లింగ్‌ను ప్రవృత్తిగా ఎంచుకున్నారు. విజయవాడలోని బాబు అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి, దాన్ని బస్సు, ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా ఔరంగాబాద్‌కు తరలిస్తున్నారు. అక్కడ గంజాయి వినియోగదారులకు అధిక ధరలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నట్లు తేలింది.

హిందూపూర్‌లో 'వందే భారత్' హాల్టింగ్

బర్కత్‌పుర, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరం నుంచి హిందూపూర్ వెళ్లే ప్రయాణికులకు శుభావార్త చెప్పారు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20703) హిందూపూర్‌లో ఆగుతుందని(హాల్టింగ్) ట్విట్టర్‌లో పేర్కొన్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఉదయం 5.45గంటలకు బయల్దేరి మహబూబ్‌నగర్‌కు 6.54 గంటలకు, కర్నూలుకు 8.28 గంటలకు, అనంతపూర్‌కు 10.43 గంటలకు, ధర్మవరంకు 11.10 గంటలకు చేరుతుంది. హిందూపూర్‌కు ఉదయం 11.40 గంటలకు చేరే అవకాశం ఉంటుంది. ఈ రైలు యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఏ తేదీ నుంచి వందే భారత్ రైలు హిందూపూర్‌లో ఆగుతుందో దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించాల్సి ఉంది.

'అంబర్‌పేట నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయాలి'

బర్కత్‌పుర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అంబర్‌పేట నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గం మహిళా మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ... మోదీప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.అమృత, మహిళామోర్చా నగర ప్రధానకార్యదర్శి జ్యోతి, బీజేపీ నేతలు ఎక్కాల నందు, యేడెల్లి అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్, రవిందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కనీస వేతనాల జీవోను విడుదల చేయాలి'

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాల జీవోను వెంటనే విడుదల చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచి ప్రభుత్వం జీవోను విడుదల చేయాలన్నారు. ఆస్పత్రుల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలన్నారు. నాయకులు ఎస్ఎల్.పద్మ, కృష్ణ, నరేందర్, హన్మేష్, రామయ్య, రాజన్న, ప్రవీణ్, అరుణ్‌కుమార్, వెంకట్, ముత్తన్న పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి నర్సింగ్‌రావు పోరాటం

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ


బీజేపీ రాష్ట్ర నేత నర్సింగ్‌రావు గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కుషాల్ గౌడ్

ముషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎం.నర్సింగ్‌రావు గౌడ్ ఆయన జీవిత కాలం కృషిచేశారని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మంగళవారం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుషాల్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎం.నర్సింగ్‌రావుగౌడ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... పార్టీ అభ్యున్నతి కోసం సామాన్య కార్యకర్తగా పనిచేసి, ముషీరాబాద్‌లో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు నర్సింగ్‌రావుగౌడ్ అండగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచిముదిరాజ్, పార్టీ నాయకులు వినుత, జమాల్‌పురి నందు, ప్రవీణ్, అనిల్, సాయి శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు సహకరించాలి: డీఎంసీ


మాట్లాడుతున్న డీఎంసీ రామానుజులరెడ్డి

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ సమితి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి సూచించారు. ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో కల్పించాల్సిన సౌకర్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై మంగళవారం జలమండలి, ఎలక్ట్రిసిటీ, హైడ్రా, రాంకీ, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల అధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవసమితి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు వినయ్‌కుమార్, శివాజీ, పరిమళ్, గడ్డం నవీన్, జలమండలి అధికారులు శివసాయి, సన్ని, పావని, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'భాగ్యనగర్' నియోజకవర్గం కన్వీనర్‌గా శివాజీ


శివాజీకి నియామక పత్రం అందజేస్తున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి వారు

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్‌గా బీజేవైఎం సికింద్రాబాద్ మహాకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు వైకుంఠం, కార్యదర్శి ఆలె భాస్కర్ ప్రకటించి, నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో వినయ్‌కుమార్, బుర్రా రాజశేఖర్, శక్తిసింగ్, మహేందర్‌బాబు పాల్గొన్నారు.


రమేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి వారు

అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్‌గా రమేష్

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్‌గా బీజేపీ సీనియర్ నాయకుడు అచ్చిని రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కేంద్ర కమిటీ సభ్యులు నాయిని బుచ్చిరెడ్డి, కార్యదర్శి ఆలె భాస్కర్ మంగళవారం ప్రకటించి ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, వైకుంఠం, వెంకటేష్, వెంకటస్వామి, శ్రీనివాస్, సురేష్‌గౌడ్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు దూరంగా మండపాలు ఉండాలి

ముషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాలను విద్యుత్ తీగలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని గణేశ్ ఉత్సవ నిర్వాహకులకు ముషీరాబాద్ సీఐ రాంబాబు సూచించారు. ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గణేశ్ మండపాలను ఏర్పాటులో తప్పనిసరి జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరి విద్యుత్, అగ్నిమాపకశాఖ, పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. రోడ్లపై గణేశ్ మండపాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతోపాటు ప్రమాదంలో ఉన్న వారికి ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో ఆగమనం పేరుతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. అనుమానితుల పట్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, డీజే సౌండ్ ఎట్టిపరిస్థితుల్లో పెట్టొద్దని సూచించారు.

చెట్ల కొమ్మలను తొలగించాలి : జెడ్సీ


చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మారుతిదివాకర్

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో గణేశ్ నిమజ్జన వేడుకలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ అధికారులకు సూచించారు. అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్, ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలతతో కలిసి ఆయన మంగళవారం అంబర్‌పేటలో పర్యటించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలించారు. మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద ఉన్న వరద సమస్యను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికార యంత్రాంగం కృషి చేస్తుందన్నారు.

మండపాల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలి



విద్యుత్ సేఫ్టీ పరికరాలను ప్రదర్శిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సూచించారు. అయితే గణేశ్ మండప నిర్వాహకులు భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మంగళవారం అడిక్‌మెట్ లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ మండపాల నిర్వాహకులు గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించడానికి వివిధ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండుగలు జరుపుకోవడానికి తీసుకోవాల్సిన పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, ఏసీపీలు ఎ.మట్టయ్య, హరీష్‌కుమార్, శశాంక్ రెడ్డి, పలు పీఎస్‌ల సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు పి.నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్‌శ్యామ్, డాక్టర్ యూనస్, మధుసూదన్, సోమాని, ఫరీదుద్దీన్, డాక్టర్ మజారోద్దీన్, బసంత్‌కౌర్, శ్రీలత పాల్గొన్నారు.